సాక్షి
ఒడిశా
సోమవారం । 7 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం

నగదు: రూ.6.60.402
బంగారం: 4 గ్రాముల 100 మిల్లీ గ్రాములు
వెండి: 53 గ్రాముల 900 మిల్లీ గ్రాములు
-భువనేశ్వర్/పూరీ



అన్నపూర్ణగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

-8లో



వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని అటవీ శాఖ రేంజర్ అనిల్‌కుమార్ పాణిగ్రహి అన్నారు. వన్యప్రాణుల సంరక్షణపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

-8లో

న్యూస్‌రీల్

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

రాయగడ: హత్య కేసులో నిందితుడిని బిసం కటక్ పోలీసులు శనివారం సాయంత్రం కళ్యాణసింగుపూర్ ప్రాంతంలో అరెస్టు చేశారు. గత మంగళవారం రాత్రి చాటికొనలోని మలివీధిలో ఘాసీరాం జిలకర అనే వ్యక్తి ఇంటి ఆవరణలో ఉండగా నియమగిరి ప్రాంతం ఖజురి గ్రామవాసి లోకినాథ్ ప్రస్కా అలియాస్ పింటు గొడ్డలితో నరికి హత్య చేశాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. హత్యకు వినియోగించిన గొడ్డలిని కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టుకు తరలించారు.

రూ.50 ఇవ్వలేదని యువకుడు ఆత్మహత్య



నవీన్ (ఫైల్)

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని వెటర్నరీ వీధిలో నివాసముంటున్న ఎం.నవీన్(26) అనే యువకుడు శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లికి 50 రూపాయలు అడగ్గా తన వద్ద లేవని చెప్పడంతో గొడవపడ్డాడు. వెంటనే గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కొంతసేపటి తర్వాత తలుపు తట్టగా తీయకపోవడంతో కేకలు వేసి ఇరుగుపొరుగు వారికి పిలిచింది. వారు వచ్చి తలుపులు బద్దలు కొట్టగా ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని విగతజీవిగా కనిపించాడు. వెంటనే మల్కన్‌గిరి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ రీగాన్‌కిండో సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నాడు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పోరాట యోధురాలు లక్ష్మీ పండా



లక్ష్మీ పండా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జయపురం: స్వాతంత్య్ర సమరంలో అలుపెరుగని పోరాటం చేసిన యోధురాలు లక్ష్మీ పండా అని వక్తలు పేర్కొన్నారు. జయపురం పూజ్యపూజ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం లక్ష్మీ పండా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విప్లవ భావాలకు ఆకర్షితురాలై ఆజాద్ హింద్ ఫౌజ్‌లో సేనానిగా చేరి శత్రువులతో పోరాటం సాగించిన పండా చిరస్మరణీయురాలని కొనియాడారు. ఆమె ఆశయసాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆకాశవాణి విశ్రాంత అధికారి ఉదయశంకర జానీ, ప్రొఫెసర్ సత్యనారాయణ రథ్, డాక్టర్ పరేష్ రథ్, సంస్కృత అధ్యాపకులు మనోజ్ మిశ్రా, శివకేశవ దాస్, ప్రమోద్‌కుమార్ రౌళో, ప్రబీర్ పాత్రో, తపన కిరణ్ త్రిపాఠీ, భైరాగీ సాహు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక దసరా



మాట్లాడుతున్న జిల్లా వైదిక ప్రముఖ్ అక్షయ జెనా

జయపురం: దసరా పండగ హిందూ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్రీయ స్వయం సేవక సంఘం(ఆర్.ఎస్.ఎస్) జయపురం పట్టణ సంచాలకుడు డాక్టర్ నిరంజన్ మిశ్రా, జిల్లా వైదిక ప్రముఖ్ అక్షయ జెనా అన్నారు. ఆదివారం స్థానిక దివ్య జీవన సంఘ ప్రాంగణంలో దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవికి పూజలు చేశారు. ఈ సందర్భంగా దసరా ప్రాధాన్యతను వివరించారు. ధ్వజారోహణ, అమృత వచన, వ్యక్తిగత గీత, వైదిక సేవ తదితర అంశాలపై ప్రసంగించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

• స్పీకర్‌తో కర్ణాటక బృందం



కర్ణాటక శాసన మండలి డిప్యూటీ స్పీకర్ ఎం.కె.ప్రాణేష్ ఆధ్వర్యంలోని ప్రతినిధుల బృందం ఆదివారం ఒడిశా రాష్ట్ర శాసన సభ స్పీకర్ సురమా పాఢితో భేటీ అయింది. శాసనసభ పని తీరు, సంబంధిత అంశాలపై చర్చించింది. అనంతరం పూరీ, కోణార్కు తదితర పర్యాటక కేంద్రాలను సందర్శించింది. సమావేశంలో రాష్ట్ర శాసన సభ కార్యదర్శి దాశరథి శత్పతి పాల్గొన్నారు. – భువనేశ్వర్

• చేతికి చిక్కిన సర్పం



బొయిపరిగుడ హనుమాన్ నగర్‌లో ఐదు అడుగుల విష నాగు కలకలం సృష్టించింది. నీలమణి సాగరియ ఇంటి గోడ సందులో పాము ఉన్నట్లు గుర్తించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు స్నేక్ హెల్ప్‌లైన్ ప్రతినిధి దొంబురు మాఝికి తెలియజేయగా ఆయన చాకచక్యంగా పామును పట్టుకుని అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు. – జయపురం

• మందిరం పరిశుభ్రం



జయపురంలోని దేవీ మందిరాలను శ్రీరామమందిర పరిచాలన కమిటీ సభ్యులు ఆదివారం శుభ్రం చేశారు. కమిటీ కార్యదర్శి సానా జగదీష్ నేతృత్వంలో భూపతి వీధిలోని కనక దుర్గా మందిరం, పూర్ణఘడ్ ప్రాంతంలోని దక్షిణ కాళీ మందిరం తదితర ఆలయ పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎ.తిరుమల, పి.గుప్తేశ్వరరావు, వి.రామారావు, జి.రమణారావు, వి.శివ, వి.పద్మావతి, జి.శ్రీలత పాల్గొన్నారు. – జయపురం

సురక్షితమేనా?

- హీరాకుద్ ఆనకట్ట పటిష్టత గుర్తించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- 21 నుంచి మూడు రోజుల పాటు పరిశీలన
- భూకంపం జోన్ 2 నుంచి జోన్ 3కు పెరగడంతో ముందస్తు చర్యలు



హీరాకుద్ ఆనకట్ట

భువనేశ్వర్: రాష్ట్రానికే తలమానికంగా నిలిచే సాగునీటి కట్టడాల్లో హీరాకుద్ ఆనకట్ట ముందంజలో ఉంటుంది. 1957 సంవత్సరంలో హీరాకుద్ జలాశయంపై నిర్మితమైన ఈ కట్టడం పటిష్టతను గుర్తించేందుకు ప్రభుత్వ యంత్రాంగం దృష్టి సారించింది. భూకంపాలు వంటి వైపరీత్యాల సమయంలో ఆనకట్ట ఏ మేరకు తట్టుకుంటుందో, ఇతర లోపాలు ఏమైనా ఉన్నాయో లేవో గుర్తించాలని నిర్ణయించింది. ఈ బాధ్యతలను రాజస్థాన్‌లోని జైపూర్ మాలివ్యయా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్ఐటీ)కు అప్పగించింది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ నెల 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు ఈ ప్రక్రియ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఆనకట్ట నిర్మించిన 67 ఏళ్ల తర్వాత ఈ దిశగా పరిశీలన పనులు చేపట్టడం గమనార్హం. ఆనకట్ట నిర్మాణ శైలి, జలాశయం నిర్వహణ వ్యవస్థ, భూకంప భద్రత ఇతరేతర అనుబంధ అంశాల్ని పరిగణనలోకి తీసుకుని సర్వే పనులు ప్రారంభిస్తారు.

రూల్ కర్వ్..

జలాశయం నీటి మట్టం నిర్వహణ, వరదకు ముందు, తర్వాత జలాశయం లోనికి నీటి ప్రవాహం, విడుదల స్థితిగతుల్ని సమీక్షిస్తారు. రూల్ కర్వ్ ప్రామాణికంగా నీటి నిల్వ పరిస్థితిని తెలుసుకుంటారు. జలాశయంలో పూడికతో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయన్న అంశంపైనా ఈ బృందం పరిశీలన చేపట్టనుంది.

భూకంపం జోన్‌లో..

మహానది బేసిన్ భూకంపం జోన్ పరిధిలో ఉంది. ఇటీవల ఈ పరిస్థితి జోన్ 2 నుంచి జోన్ 3కి పెరిగింది. ఈ నేపథ్యంలో ఆనకట్ట పటుత్వం అంచనా వేసేందుకు ఈ సర్వే దోహదపడుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి కేంద్ర జల వనరుల శాఖ మహానది డివిజన్ అధికార వర్గాలకు లేఖ రాసింది.

16 జిల్లాలకు ఆధారం..

ఈ జలాశయంపై రాష్ట్రంలో 16 జిల్లాలు ఆధారపడి ఉన్నాయి. రాష్ట్రంలో జీవన రేఖగా ప్రాధాన్యత సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఆనకట్టల భద్రత విభాగం ఏర్పాటు చేసింది. ఈ విభాగం కార్యాచరణలో భాగంగా హీరాకుద్ జలాశయం పటుత్వం సర్వే ప్రక్రియని లాంఛనంగా శ్రీకారం చుట్టింది. పూడిక పేరుకుపోవడంతో జలాశయంలో నీటి నిల్వ ప్రభావితమవుతోంది. నీటి ప్రవాహం, విడుదల కార్యాచరణలో భారీ సంస్కరణలు చేపట్టాల్సి ఉందని నిపుణుల వర్గం అభిప్రాయం. ఈ నేపథ్యంలో రూల్ కర్వ్‌ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రస్తుత స్థితిగతులకు అనుగుణంగా సంస్కరించే యోచన పరిశీలనలో ఉంది.

నేడు ప్రైవేటు బస్సుల బంద్



మాట్లాడుతున్న నరేంద్రకుమార్ మహంతి

- లక్ష్మీబస్సుల కొనసాగింపునకు నిరసనగా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం నిర్ణయం

జయపురం: లక్ష్మీ బస్సులు కొనసాగిస్తుండటాన్ని నిరసిస్తూ సోమవారం సాయంత్రం 6 నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ప్రైవేటు బస్సుల బంద్ పాటిస్తున్నట్లు జయపురంలోని ప్రైవేట్ బస్సుల యాజమాన్య సంఘ కార్యదర్శి నరేంద్రకుమార్ మహంతి ప్రకటించారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ప్రభుత్వం వెంటనే లక్ష్మీ బస్సులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రైవేటు బస్సులను నిరవధికంగా నిలిపివేస్తామని హెచ్చరించారు. తొలుత లక్ష్మీ బస్సులను సమితి నుంచి మరో సమితి మధ్య లక్ష్మీ బస్సులు నడిపేవారని, ఇప్పుడు ఇతర జిల్లాలకు కూడా నడుపుతున్నారని చెప్పారు. గతంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం తుంగలోకి తొక్కిందని దుయ్యబట్టారు. ఇందుకు నిరసనగా 24 గంటల బంద్ చేపడుతున్నామని చెప్పారు. అప్పటికీ స్పందించకపోతే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝికి వివరిస్తామని చెప్పారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు బి.సుబ్రహ్మణ్య పాత్రో, కార్యదర్శి ఎన్.శంకరరావు, సభ్యులు సంతోష్ సామంతరాయ్, సాంబశివరావు, దిల్లేశ్వర బెహరా, అశోక్ మహాపాత్రో, త్రిపతి పాణిగ్రహి, బణబిహారి త్రిపాఠీ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న తెలుగు సంఘాల ప్రతినిధులు

కొరాపుట్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మాదిరిగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నివసిస్తున్న తెలుగు ప్రజలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆ రాష్ట్ర తెలుగు మహా సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం జగదల్‌పూర్ పట్టణంలో బాలాజీ టెంపుల్ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో సంఘ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్న తెలుగు సంఘాల ప్రతినిధులు హాజరై సమస్యలపై చర్చించారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతుల ప్రజలకు తెలుగు రాష్ట్రాల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్నారని చెప్పారు. అదే కులాల వారికి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రిజర్వేషన్లు కల్పించడం లేదన్నారు. శతాబ్దాలుగా ఈ ప్రాంతంలో నివాసముంటున్న తెలుగు ప్రజలకు రాజ్యాంగపరమైన హక్కులు ఉన్నప్పటికీ రిజర్వేషన్లు లేకపోవడం విచారకరమన్నారు. ఈ విషయమై పోరాటం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో తెలుగు మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.మురళి, బస్తర్ జిల్లా ఆంధ్రా సమాజం అధ్యక్షుడు ఎం.జయంత్‌నాయుడు, కౌన్సిలర్ కె.యశ్వర్ధన్‌రావు, ఆంధ్ర సమాజం కార్యదర్శి సుబ్బారావు, రాయ్‌పూర్ తెలుగు సంక్షేమ సంఘం, బిలాస్‌పూర్ ఆంధ్ర సమాజ్, ప్రవాస్ ఆంధ్ర ప్రజా నాట్య మండలి తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదానం చేస్తున్న క్లబ్ సభ్యులు

రాయగడ: రక్తదానంపై అపోహలు వీడి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తం దానం చేయాలని విశ్రాంత డాక్టర్ వీఎల్ఎన్ రాజు పిలుపునిచ్చారు. స్థానిక బాలాజీనగర్‌లోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద లేడీస్, యూత్ వాకర్స్ క్లబ్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేస్తే అనారోగ్యానికి గురవుతామని చాలా మంది అపోహ పడుతుంటారని, అందులో వాస్తవం లేదన్నారు. కొన్నాళ్లుగా పట్టణంలో వివిధ సేవా సంస్థల ఆధ్వర్యంలో విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో రక్తనిధిలో కొరత కొంతమేర తగ్గుముఖం పట్టిందన్నారు. సేవా సంస్థలు ఇటువంటి కార్యక్రమాలను కొనసాగిస్తే ఎంతోమంది ప్రాణాలు కాపాడిన వారమవుతామని చెప్పారు. అనంతరం డీహెచ్‌హెచ్ రక్తనిధి అధికారి డాక్టర్ గౌతం పట్నాయక్ పర్యవేక్షణలో 24 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో లేడీస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.రజిత, కార్యదర్శి కె.భారతి, కోశాధికారి బి.లక్ష్మి, యూత్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కె.వంశీ కిరీటి, కార్యదర్శి బరాటం అవంతి, కోశాధికారి బి.బాషా తదితరులు పాల్గొన్నారు.

రెండో పంటతో అదనపు ఆదాయం



మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జయపురం: వరి కోతలు పూర్తయిన తర్వాత చాలా మంది పంటభూములను బీడుగా వదిలేస్తున్నారని, అలాకాకుండా రెండో పంట వేస్తే అదనపు ఆదాయం పొందవచ్చని కుంద్ర సమితి వ్యవసాయాధికారి అయిన్‌కుమార్ బిశాయి అన్నారు. మహిళా లోక్ వికాస్ మంచ్, లోకో వికాస్ మంచ్ సంయుక్త ఆధ్వర్యంలో సమితి కార్యాలయ మందిరంలో ఆదివారం మహిళా కృషక్ మేళా (రైతు మేళా) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరాపుట్ జిల్లాలో అధిక శాతం మంది రైతులు మొదటి పంట తర్వాత విత్తనాల కొరత, అవగాహన లేమితో రెండో పంట వేయకుండా భూములను బీడుగా ఉంచేస్తున్నారని చెప్పారు. వీరికి రెండో పంటపై అవగాహన కల్పించి ప్రోత్సహిస్తే ఆర్థికంగా లాభపడతారని చెప్పారు. అవసరమైన విత్తనాలు సైతం సమకూర్చుకునే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో లోక్ వికాస్ మంచ్ సమితి కో–ఆర్డినేటర్ చంద్రపూజారి, అధ్యక్షుడు అనంత నాయిక్, కార్యదర్శి మాధవ ఉదలబ ొడియ తదితరులు పాల్గొన్నారు.

+2 పరీక్షల తాత్కాలిక షెడ్యూల్ విడుదల

భువనేశ్వర్: ఉన్నత మాధ్యమిక విద్యా మండలి సీహెచ్ఎస్ఈ ఆధ్వర్యంలో జరగనున్న +2 వార్షిక పరీక్షల తాత్కాలిక షెడ్యూల్‌ను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రశాంత కుమార్ పరిడా వెల్లడించారు. ప్రాక్టికల్ రహిత సబ్జెక్టుల ఇంటర్నల్ పరీక్షలు ఈ ఏడాది డిసెంబరు 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. ప్రధాన పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి మార్చి 20 వరకు జరుగుతాయని తెలిపారు. ఫలితాలను 45 రోజుల్లో ప్రకటిస్తామన్నారు. పూర్తి స్థాయి షెడ్యూల్‌ను నవంబరు చివరి వారంలో ప్రకటిస్తామని చెప్పారు. ఇంటర్నల్ పరీక్షలు 20 మార్కులు, ప్రధాన పరీక్ష 80 మార్కులకు నిర్వహిస్తామని తెలిపారు. కనీస హాజరు 75 శాతం ఉంటనేనే పరీక్ష రాసేందుకు అనుమతిస్తామని స్పష్టంచేశారు.

కొరాపుట్‌లో నటుడు జగపతిబాబు!

కొరాపుట్: తెలుగు సినీ నటుడు జగపతిబాబు కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణంలోని ఓ హోటల్లో బస చేస్తున్నట్లు సమాచారం. ఇక్కడి పర్యాటక స్థలం దేవమాలి ప్రాంతంలో ఘాటీ పేరుతో సినిమా షూటింగ్ జరుగుతోంది. ఇందులో పాల్గొనేందుకు జగపతిబాబు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే అతని పర్యటన వివరాలపై స్పందించడానికి సినిమా యూనిట్ నిరాకరించింది.

రక్తదానం మహాదానం



రక్తదానం చేస్తున్న దాతలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రాస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 47 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్నూరు రామకృష్ణ, జి.మోహన్‌రావు, పొట్నూరు హరి, మల్లా శ్రీను, సంతోష్, ఫార్మసిస్టు ఖగేశ్వర్ బెహరా, బ్లడ్ బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు నాటుతున్న అధికారులు

రాయగడ: మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సెంచూరియన్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ రాజేష్ పాఢి, ఐడీబీఐ రాయగడ బ్రాంచి మేనేజర్ నిహారి రంజన్ సాహు అన్నారు. ఐడీబీఐ రాయగడ బ్రాంచి 60వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్థానిక పితామహల్ వద్ద సెంచూరియన్ వర్సిటీ ఆవరణలో ఆదివారం మా పాయి గొఛ్ఛొటియే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిబ్బంది అంశుమాన్ మహాపాత్రో, తపస్‌కుమార్ బారిక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గంజాయి రవాణా కేసులో వ్యక్తి అరెస్టు



అరెస్టయిన భగవాన్‌తో పోలీసులు

జయపురం: గంజాయి అక్రమ రవాణా కేసులో వ్యాన్ యజమానిని అరెస్టు చేసినట్లు బొయిపరిగుడ పోలీసు అధికారి దీపాంజలి ప్రధాన్ ఆదివారం వెల్లడించారు. జూలై 18న వ్యాన్‌లో గంజాయి రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు ఎస్‌ఐ కృష్ణచంద్ర శెఠి నేతృత్వంలో బృందం వాహనాల తనిఖీ చేపట్టింది. బొయిపరిగుడ వైపు వస్తున్న వ్యాన్‌ను ఆపేందుకు ప్రయత్నించగా డ్రైవర్ ఆగకుండా వెళ్లిపోయాడు. పోలీసులు వెంబడించడంతో డ్రైవర్, మరో వ్యక్తి వ్యాన్‌ను వదిలి పరారయ్యారు. వాహనాన్ని తనిఖీ చేయగా 275 కేజీల గంజాయి పట్టుబడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా వ్యాన్ యజమాని లక్ష్మీపూర్‌కు చెందిన భగవాన్ బారిక్‌గా గుర్తించి శనివారం అరెస్టు చేశారు.

పాముకాటుతో మహిళ మృతి



సమితాని మాఝి మృతదేహం

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి బెధిపాడ పంచాయతీ మునిగ గ్రామానికి చెందిన సమితాని మాఝి (34) పాముకాటుకు గురై మృతిచెందింది. ఆదివారం మధ్యాహ్నం భోజనం చేశాక ఇంటి సమీపంలోని పంటపొలానికి వెళ్లింది. అక్కడ పాము కాటు వేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. స్థానికులు స్పందించి వెంటనే బిసంకటక్‌లోని క్రిస్టియన్ ఆస్పత్రిలో చేర్పించగా అప్పటికే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



ఫుట్‌బాల్ జిల్లా జట్టుతో ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసన్నపేట: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరులో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించనున్న అంతర్ జిల్లాల సీనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు హాజరయ్యే జిల్లా జట్టును స్థానికంగా ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి ఆసక్తి గల ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎంపికలకు హాజరు కాగా 16 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ మంచి టీమ్‌ను ఎంపిక చేశామన్నారు. సెలెక్షన్ ప్రక్రియలో కుంచి గోపి, నవీన్‌కుమార్, రమేష్, అరవిందు కుమార్, సృజన్‌కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సోంపేట ఉద్యమం స్ఫూర్తిదాయకం

సోంపేట: సోంపేటలో చేపట్టిన పర్యావరణ పరిరక్షణ ఉద్యమం స్ఫూర్తిదాయకమని పర్యావరణ పరిరక్షణ సంఘ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. మానవ హక్కుల నేత బాల గోపాల్ 15వ సంస్మరణ సభ సుందరయ్య విజ్ఞాన్ భవన్ హైదరాబాద్‌లో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోంపేట థర్మల్ ఉద్యమంపై మానవ హక్కుల నాయకురాలు కె.అనురాధ రచించిన బీల కోసం-బతుకు కోసం సోంపేట హరిత ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని మానవహక్కుల వేదిక నాయకులు ఆవిష్కరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



లోయలోకి దూసుకుపోయిన కారు

ఇచ్ఛాపురం రూరల్: కునుకుపాటు ఆ కుటుంబ సభ్యుల్ని చావు అంచుల వరకు తీసుకువెళ్లింది. కోల్‌కతాకు చెందిన నీలాబ్జీ దాస్ కుటుంబ సభ్యులు తమ సొంత కారులో ఆదివారం వేకువ జామున వైజాగ్ వెళ్లేందుకు బయల్దేరారు. మధ్యాహ్న సమయంలో బెర్హంపూర్ వద్ద భోజనం చేసి స్థానిక-16 నంబర్ జాతీయ రహదారి గుండా వస్తుండగా, బెల్లుపడ-ఈదుపురం జంక్షన్ వద్దకు వచ్చే సరికి డ్రైవింగ్ చేస్తున్న నీలాబ్జీ దాస్ కునుకుపాట్లు పడటంతో వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న లోయలోకి దూసుకు పోయి మట్టి దిబ్బను ఢీకొట్టి ఆగిపోయింది. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. సంఘటన జరిగినప్పుడు అక్కడే ఉన్న బాటసారులు హుటాహుటిన కారు వద్దకు వెళ్లి ప్రయాణికులను క్షేమంగా బయటకు తీశారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులు వెంటనే మరో కారును అద్దెకు తీసుకొని విశాఖపట్నం పయనమయ్యారు.

అన్నపూర్ణగా అమ్మవారు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక గుండిచా మందిరంలో వేద పండితులు రేజేటి శ్రీరామశర్మ నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. పాయికొ వీధిలో సములాయి దుర్గను అలంకరించి అమ్మవారికి ప్రీతికరమైన నైవేద్యాలను సమర్పించారు. మజ్జిగౌరి మందిరం సమీపంలోని జెన్నబాలి వద్ద దుర్గామాత (జెన్నారాయి)ని ప్రత్యేకంగా అలంకరించారు. అష్టమి నాడు ఇక్కడ నిశారాత్రి పూజలు నిర్వహించారు. చిల్లింగ్ ప్లాంట్ ప్రాంతంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.

– రాయగడ



అన్నపూర్ణాదేవిగా జగన్మాత



వనదుర్గాదేవికి పూజలు



సములాయి దుర్గామాత



జెన్నబౌలి వద్ద దుర్గమ్మ



మజ్జిగౌరమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

దుకాణాలను తరలించండి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

జయపురం: కొట్‌పాడ్‌లో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న మాంసం, చేపల దుకాణాలను 15 రోజుల్లోగా బాసుగుడ గ్రామంలోకి తరలించాలని జయపురం సబ్ కలెక్టర్ ఎ.శౌశ్య రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం కొట్‌పాడ్ పంచాయతీ కార్యాలయం మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోడ్డుకు ఆనుకుని ఎక్కడికక్కడ దుకాణాలు ఉండటంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నందున కోట్లాది రూపాయలు వెచ్చించి బాసుగుడలో దుకాణాలు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ కొద్దిరోజులే విక్రయాలు జరిపి మళ్లీ రోడ్డుపైకి వచ్చేశారని, దీంతో ట్రాఫిక్ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అనంతరం వ్యాపారులు తమ ఇబ్బందులను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో కొట్‌పాడ్ ఎన్.ఎ.సి అధ్యక్షుడు ఎం.శంకరరావు, బొరిగుమ్మ సబ్ డివిజన్ పోలీస్ అధికారి తపస్విణీ కువార్, కొట్‌పాడ్ పోలీసు అధికారి పరమానంద సునాని, తహశీల్దార్ కీర్తిచంద్ర ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరంలో ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

సోంపేట: మండలంలోని పలాసపురం పంచాయతీ లక్కవరం గ్రామంలో ఈ నెల 9న ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రవేశ రుసుం లేదని, భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 9 లోగా 9908784656 నంబరుకు సంప్రదించాలన్నారు. విజేతలకు జ్ఞాపికతో పాటు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

ఆలిండియా యోగా పోటీల్లో రోహిణి అ'ద్వితీయం'



రావాడ రోహిణిని అభినందిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా యోగా పోటీల్లో జిల్లాకు చెందిన రావాణి రోహిణి అ'ద్వితీయ'మైన ప్రదర్శనతో సత్తాచాటింది. జలుమూరు మండలం లింగన్నాయుడుపేట గ్రామానికి చెందిన ఈ యువ యోగా క్రీడాకారిణి ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాయ్ వేదికగా జరిగిన ఆలిండియా పోలీస్‌క్లస్టర్ యోగా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించడమే కాకుండా రజత పతకంతో మెరిసింది. జిల్లాకు చెందిన రావాడ రోహిణి తూర్పుగోదావరి జిల్లా పోలీసుశాఖలో సైబర్ ల్యాబ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఈమె గతంలో విశాఖపట్నం, జలంధర్, నాగూర్‌లలో జరిగిన ఆలిండియా పోలీస్ యోగా పోటీల్లో పాల్గొని విజయబావుటా ఎగురవేసింది. తాజాగా జాతీయ పోటీల్లో మెరిసిన రావాడ రోహిణిని డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు, స్పోర్ట్స్ ఐజీ, తూర్పు గోదావరి ఎస్పీ డి.నరసింహాకిషోర్, అదనపు ఎస్పీ అల్లూరి వెంకటసుబ్బరాజు తదితరులు అభినందించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



విజేతలతో అటవీ సిబ్బంది



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిపైనా ఉందని అటవీ శాఖ రేంజర్ అనిల్‌కుమార్ పాణిగ్రహి అన్నారు. జిల్లాలోని టికిరి అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం వన్యప్రాణుల సంరక్షణపై చైతన్యం కల్పించేందుకు చిన్నారులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో వన్యప్రాణులు రోజురోజుకూ అంతరించిపోతున్నాయని చెప్పారు. కొంత మంది మాఫియా ముఠాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతోంది. మరికొందరు అవగాహన లోపంతో అడవులను తగులబెట్టడం, పచ్చని చెట్లను నరికివేయడం వంటి కారణాల వల్ల కూడా వన్యప్రాణులు అంతరిస్తున్నాయని చెప్పారు. కొన్నిసార్లు వేటగాళ్ల బారిన పడి కనుమరుగవుతున్నాయని తెలిపారు. అడవులను సంరక్షిస్తే వన్యప్రాణులను సంరక్షించేందుకు వీలుంటుందన్నారు. అనంతరం చిత్రలేఖనం పోటీలకు హాజరైన విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరసన్నపేట: మండలం ఆర్‌అండ్‌బీ రహదారిపై చోడవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చెన్నాపురానికి చెందిన దుండంగి కర్రి అప్పన్న(50) మృతి చెందారు. శనివారం ప్రమాదం జరగగా గాయపడిన అప్పన్నను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. అల్లాడ గ్రామంలో బంధువుల ఇంటికి శుభ కార్యక్రమానికి వెళ్లి సైకిల్‌పై తిరిగి వస్తుండగా 3.30 సమయంలో చోడవరం సెంటర్ వద్దకు వచ్చే సరికి అతి వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో అప్పన్నకు బలమైన గాయాలు కాగా వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ మృతి చెందాడు. మృతునికి భార్య అశిరమ్మ కుమారులు కార్తిక్, మధు ఉన్నారు. భార్య అశిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదంపై నరసన్నపేట ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చోడవరం కూడలి వద్ద ప్రమాద దృశ్యం



మృతుడు కర్రి అప్పన్న (ఫైల్)

ఇసుక, లిక్కర్ మాఫియాలకు అడ్డాగా ఆమదాలవలస



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ప్రశాంతతకు మారుపేరుగా ఉండే ఆమదాలవలస నియోజకవర్గాన్ని ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాలకు అడ్డాగా స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ తయారు చేశారని, ఆ మాఫియాల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. స్థానిక జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చింతాడ రవికుమార్ మాట్లాడుతూ గత 4 నెలలుగా నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో కూన రవికుమార్ తన ఇసుక మాఫియాను రంగంలోకి దించి యథేచ్ఛగా ఇసుకను దోచుకుంటూ రోజుకు రూ.2కోట్లు ఆర్జిస్తున్నారని తెలిపారు. ప్రశ్నిస్తున్న వారిపై దాడులకు దిగుతున్నారని అన్నారు. రెండు రోజులుగా మద్యం షాపులకు టెండర్ల విషయంలో కూడా ఇదే విధంగా తన మాఫియాను దించి బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. కూన రవికుమార్ నేరుగా షాపులకు టెండర్లు వేసిన వారికి ఫోన్ చేసి ఆమదాలవలస నియోజక వర్గం నాది, ఇక్కడ ఎవరూ టెండర్లు వెయ్యకూడదని, తన మాట కాదని టెండర్లు వేస్తే వారి అంతు చూస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఇలాంటి సంస్కృతి ఎక్కడో బీహార్‌లో ఉంటుందని విన్నామని, అదే సంస్కృతికి ఇప్పుడు ఆమదాలవలస నియోజకవర్గంలో కూన రవి తెర లేపుతున్నారని పేర్కొన్నారు. త్వరలో ఒక ప్రణాళికాబద్ధంగా ఈ మాఫియా ఆగడాలను అడ్డుకుంటామని చింతాడ రవికుమార్ అన్నారు. సమావేశంలో ప్రచారవిభాగం జిల్లా ఉపాధ్యక్షులు కొప్పల ఈశ్వరరావు, పార్టీ కార్యకర్తలు అన్నెపు కృష్ణ, బుడుమూరు రామ్మోహన్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెగులు.. దిగులు

- జిల్లాలో 3.58 లక్షలు ఎకరాల్లో వరి సాగు
- ఉష్ణోగ్రత పెరగడంతోనే వరి పైరుకు తెగుళ్లు
- అప్రమత్తం అవసరం అంటున్న నిపుణులు



వరి పైరు సోకిన ఎండు ఆకు తెగులు



వ్యవసాయ సహాయక సంచాలకులు రవీంద్రభారతి

జలుమూరు: వరికి తెగుళ్ల సోకుతుండడంతో రైతులు దిగులు చెందుతున్నారు. గడిచిన నెల వరకూ వర్షాభావ పరిస్థితులు, సాగునీరు, ఎరువులు, కూలీల కొరత, కలుపు నివారణతో అవస్థలు పడిన రైతన్నలు ఇప్పుడు తెగుళ్లతో ఆందోళన చెందుతున్నారు. ఉష్ణోగ్రత పెరగడంతోనే వరి పైరుకు అధికంగా తెగుళ్ల సోకుతాయని, వీటిని నివారించేందుకు అప్రమత్తంగా ఉండడంతో పాటు నివారణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 3.58 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా అత్యధికంగా జలుమూరులో 19,849 ఎకరాలు, అత్యల్పంగా కవిటిలో 2,120 ఎకరాల్లో సాగవుతున్నట్లు వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. వరి నాట్లు, వెదలు పూర్తయ్యి దాదాపు 90 రోజులు దాటుతుండడంతోపాటు ఈ పైరు చిరుపొట్ట దశకు చేరుకున్నాయి. ఇటీవల ఉష్ణోగ్రతలు పెరగడంతో చాలా చోట్ల వరికి తెగుళ్ల సోకుతున్నాయి. ఈ సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించుకోవచ్చనని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వరి పైరుకు అగ్గి తెగులు, పాడతెగులు, ఎండాకు తెగులు పోకుతున్నాయి. వాతావరణం వేడెక్కడం, పైరుకు కావాల్సినంత నీరు లేకపోవడం వల్ల తెగుళ్ల వ్యాప్తి చెందుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అగ్గి తెగులు

వరి పైరు ఆకుమీద చిన్న డైమండ్ వంటి ఆకారంతో మచ్చలు ఏర్పడతాయి. అనంతరం ఆకు అంతా వ్యాప్తి చెంది నల్లగా మారి దుబ్బంతా మొక్కంతా మాడి పోతుంది.

నివారణ

అగ్గి తెగులు నివారణకు సైక్లోజిన్‌బాన్ ఎకరాకు 120 గ్రాములు ఫౌడర్ నీటిలో కలిపి సుమారు 150 లీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే పెస్టో సైక్లిన్ 18 గ్రాములు నీటిలో కలిపి ఎకరాకు 150 లీటర్లు పిచికారీ చేసుకోవాలి.

పాద తెగులు

వరి పైరుకు మొదటి భాగం నుంచి ఈ తెగులు సోకుతుంది. మొదటి భాగంలో పొడ పాము మీద ఉన్న మచ్చలు ఉన్నట్లే వరి పైరు దుబ్బుకు సోకి కింద నుంచి పైకి వెళ్తుంది. అలాగే వరి దుబ్బంతా మచ్చలతో మారి ఎండి పోతుంది.

నివారణ

పొలం గట్ల మీద ఉన్న గడ్డిని పూర్తిగా తొలగించడం అవసరమైతే ఆ గడ్డిని కోసేయడం వల్ల కూడా నివారణ చేసుకోగలము. వీటితోపాటు పొడ తెగులు నివారణకు కాంటాఫ్ ఎకరాకు 400 మిల్లీ లీటర్లు 150 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. అలాగే అవతార్ అర కేజి పౌడర్ తగినంత నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే నివారణ చేసుకోగలం.

ఎండు ఆకు తెగులు

వరి పైరులో ఆకులకు ముందుగా ప్రారంభమై ఈ తెగులు చివరి వరకూ సోకుతుంది. ఆకుపచ్చని రంగును క్రమేపీ హరించి వరి ఆకులన్నిటినీ బూడిద రంగులోకి మార్చేస్తుంది. దీని వల్ల ఆకులతోపాటు వరి పిలకలు అన్నీ ఎండిపోయి దుబ్బు చచ్చి పోతుంది.

నివారణ

ఎండు ఆకు నివారణకు ప్లాంటా మాసిన్ 100 గ్రాములు లేదా 200 గ్రాములు ఎండోఫిల్ జెడ్ 78 పిచికారి చేసుకుంటే నివారించుకోగలం.

ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో చోరీ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల ఎస్‌బీఐ స్టాఫ్ కాలనీలో గత నెల 30న చోరీ జరిగిందని బాధితుడు రిటైర్ ఉద్యోగి మౌనంగి నాగేశ్వరరావు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్‌ఐ ఇచ్చిన వివరాలు మేరకు.. ఎస్‌బీఐ స్టాఫ్‌లో నివసిస్తున్న నాగేశ్వరరావు తన కొడుకు వద్దకు ఈనెల 26న జార్ఖండ్ వెళ్లాడు. అయితే 30వ తేదీ నాటికి ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండడం, డోర్ లాక్ బ్రేక్ చేయడంతో పైన అద్దెకు ఉన్న వారు బాధితుడు నాగేశ్వరావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన వచ్చి అన్నీ పరిశీలించి 83 గ్రాములు విలువ చేసే బంగారు చైన్‌లు దొంగిలించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకావిష్కరణ



ఉద్దానం కిడ్నీ విషాదాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు కవులు

పలాస: పలాస డివిజన్‌లోని ఏడు మండలాల పరిధిలో ఉన్న ఉద్దానం ప్రాంతం కిడ్నీ వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారం కావాలని, అందుకు పాలక వర్గాలు చిత్తశుద్ధితో పనిచేయాలని, పౌర సమాజం కూడా అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల్లో తగిన చైతన్యం తీసుకురావాలని ద్రవిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి, ప్రొఫెసర్ కేఎస్ చలం చెప్పారు. పలాస మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆదివారం కళింగ సీమ సాహిత్య సంస్థ అధ్యక్షుడు సన్నశెట్టి రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 'ఉద్దానం కిడ్నీ విషాదాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చలం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి ఎంతో లోతైన చరిత్ర ఉందని వివరించారు. ఎవరికీ లొంగని ఈ ప్రాంతం, ఈ ప్రాంత ప్రజలు నేడు కిడ్నీ వ్యాధి బారిన పడి మృత్యువాత పడటం చాలా బాధాకరమన్నారు. దీని నుంచి బయట పడాలంటే పౌరసమాజం అప్రమత్తంగా ఉండాలని, గతం కన్నా ఐక్యంగా ఉండాలని, పాలక వర్గాలపై ఒత్తిడి పెంచాలని, మెరుగైన వైద్య సదుపాయాలకోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పుస్తక సంపాదకులు బద్రి కూర్మారావు, పలువురు ప్రముఖ వైద్యులు డాక్టరు ఎం.మల్లేశ్వరరావు, డాక్టరు తెప్పల ఆనంద్, డాక్టరు గిరిబాబు, డాక్టరు ఖగేశ్వరరావు, బమ్మిడి సుబ్బారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

క్లుప్తంగా

కోలాటం పోటీల్లో విజేతలు వీరే



కోలాటం పోటీల్లోని దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియం సౌజన్యంతో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి కోలాటం పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి బహుమతిని నారాయణప్పవలసకు చెందిన శ్రీ లక్ష్మీనరసింహ గ్రూప్ కైవసం చేసుకుంది. ఆ తరువాత వరుసగా శ్రీకాకుళం జిల్లా పొందూరుకు చెందిన దుర్గాదేవి గ్రూపు, బలిజిపేట మండలం అరసాడ గ్రూపు, నిడగల్లుకు చెందిన సిద్ధి వినాయక గ్రూప్, తోణాంకు చెందిన బంగారమ్మ తల్లి గ్రూప్ వరుసగా ఐదు స్థానాలు దక్కించుకున్నాయి. న్యాయనిర్ణేతలుగా మీసాల చిన గౌరినాయుడు, టీవీ రమణ, చింత రమణ, జి.సిమ్మినాయుడు వ్యవహరించారు.

కోడిపందాల స్థావరంపై పోలీసుల దాడి • 14మంది అరెస్ట్



పట్టుబడిన నిందితులు, కోళ్లు, సెల్‌ఫోన్లతో ఎస్సైలు, సిబ్బంది

బాడంగి: మండలంలోని కోడూరు గ్రామ శివారు తోటలలో నిర్వహిస్తున్న కోడిపందాల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడిచేసి 14 మంది నిందితులను పట్టుకుని వారినుంచి కోళ్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోడిపందాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడిచేయగా 14మంది వ్యక్తులు దొరికారు. దీంతో వారి దగ్గర 6 కోడిపుంజులు, 9 వేల 200నగదు, 11సెల్ ఫోన్లు, ఒకమోటార్‌సైకిల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించారు.

జేవీవీ జాతీయ కార్యదర్శికి సత్కారం

విజయనగరం అర్బన్: జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీని ఆదివారం స్థానిక ప్రైవేట్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా కృష్ణాజీ మాట్లాడుతూ... ఉద్యోగ బాధ్యతల నుంచి విరమణ పొందానని, ఇకనుంచి తనకున్న సమయాన్ని ఎక్కువగా జన విజ్ఞాన వేదిక కార్యక్రమానికి కేటాయిస్తానని చెప్పారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక సభ్యులు గండ్రేటి లక్ష్మణరావు, గండ్రేటి అప్పలనాయుడు, జాతీయ విద్యా కమిటీ కన్వీనర్ డాక్టర్ ఏవీ రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పైల రమేష్‌రాజు, నగర అధ్యక్షుడు షిణగం శివాజీ, ప్రధాన కార్యదర్శి పి. షణ్ముఖరావు, రాజగోపాల్, కె. సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సీరాపు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిల్స్‌తో నిందితుడి అరెస్ట్

వంగర: మండల పరిధి శివ్వాంలో బెల్టుషాపులపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఎస్సై షేక్ శంకర్ ఆధ్వర్యంలో చేసిన ఈ దాడుల్లో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 14 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

వృద్ధుడిపై పోక్సో కేసు

భామిని: మండలంలోని తాలాడకు చెందిన తొమ్మిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు కొత్తపల్లి చిన్నారావు (69) అసభ్యకరంగా ప్రవర్తించి లైంగికదాడికి యత్నించినట్లు అందిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు బత్తిలి ఎస్సై డి.అనిల్‌కుమార్ ఆదివారం తెలిపారు. గ్రామంలో శనివారం ఉదయం బాలిక ఒంటరిగా ఉండగా నిందితుడైన వృద్ధుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాధితురాలి నాయనమ్మ ఆదివారం ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో బాధిత బాలికను వైద్య పరీక్షలకు తరలించినట్లు వివరించారు. నిందితుడు చిన్నారావు రాజమండ్రిలో కూలి పనులు చేసుకుంటున్నాడని, ప్రతి నెల పింఛన్ తీసుకునేందుకు తాలాడ గ్రామానికి వస్తున్నాడని స్థానికులు తెలిపారు. బాధితురాలి తండ్రి కూడా వైజాగ్‌లో కూలి పనులు చేస్తుండగా నాయనమ్మ దగ్గర ఉంటూ ఆ బాలిక చదువుకుంటున్నట్లు గ్రామస్తులు చెప్పారు.

నేడు హజరత్ ఖాదర్‌వలీబాబా జయంతి

విజయనగరం టౌన్: సూఫీ సద్గురువు, మహిమాన్విత మహర్షి, బాబామెట్ట తూర్పు కనుమన ఉదయించిన ఆధ్యాత్మిక తేజో కిరణ హజరత్ సయ్యద్ ఖాదర్ వలీబాబా 128వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరగనున్నాయి. ఈ మేరకు దర్గా దర్బార్ షరీఫ్ ముతవల్లి (ధర్మకర్త) డాక్టర్ ఎం.డి.ఖలీలుల్లా షరీఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం దర్గాలో ఖురాన్ పఠనం, ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, ఫకీరు మేళాలతో దర్బార్ నుంచి ప్రత్యేక చాదర్, సుగంధం, పూలు, పండ్లు, స్వీట్లతో ఊరేగింపుగా వెళ్లి దర్గాలో బాబాకు సమర్పిస్తామన్నారు.

పైడితల్లి చరితం అపురూపం



వనగుడి పైడితల్లి అమ్మవారు



వనగుడిలో అద్దాల మంటపం

- నాడు వనదేవత..నేడు జనదేవత
- పెద్దచెరువులో అమ్మ ప్రతిరూపాలు
- వనగుడిలో కొలువైన దుర్గమ్మ, ముత్యాలమ్మ

విజయనగరం టౌన్: జిల్లా ప్రజల ఇలవేల్పు..ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి చరితం అమోఘం. ఎన్ని సార్లు విన్నా..వినాలనిపించే ఆ తల్లి చరిత్ర వింటే పుణ్యఫలం. ఆ తల్లిని మనసులో స్మరిస్తూ కోర్కెలు కోరితే..కొద్ది రోజుల్లోనే ఈడేరిన వెంటనే ప్రపంచంలో ఎక్కడున్నా ఆ తల్లిని దర్శించుకునేందుకు భక్తులు తరలిస్తారు. అక్కడితో ఆగకుండా ఏటా అమ్మను దర్శించుకోవడానికి తొలేళ్ల నుంచి సిరిమానోత్సవం వరకూ ఉండి పసుపు, కుంకుమలతో పాటు మొక్కుబడులు చెల్లిస్తారు. చల్లంగా చూడుతల్లీ..మళ్లీ వస్తామంటూ ఆ ప్రకృతి స్వరూపిణి పైడితల్లిని భక్తిపూర్వకంగా ప్రార్థిస్తారు. అంతటి మహిమాన్వితమైన ఆ పైడితల్లమ్మ వెలిసింది విజయనగరం లోని రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలోనే. పైడితల్లి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడికి వెళ్లడం ఆనవాయితీ. సిరిమానోత్సవం కూడా అక్కడి నుంచే ప్రారంభమవుతుంది. కోటశక్తికి విశేష పూజలు నిర్వహిస్తారు. అయినప్పటికీ అమ్మవెలిసింది వనంలోనే. అప్పట్లో స్థానిక రైల్వేస్టేషన్ ప్రదేశం పూర్తిగా అటవీ ప్రాంతంగా ఉండేది. ఇదివరలో రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని అన్యాయపురంగా పిలిచేవారు. ఎందుకంటే అదంతా దారిదోపిడీలకు నిలయంగా ఉండేదని నానుడి. వనంలోనే వెలిసిన ఆపైడితల్లి ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథనం ఉంది.

వనంగుడిలో దుర్గమ్మ, ముత్యాలమ్మ

వనంగుడిలో అమ్మవారికి ఇష్టమైన దుర్గాదేవి, ముత్యాలమ్మ అమ్మవార్లు కొలువై పూజలందుకుంటున్నారు. ప్రతి నెలా మూలా నక్షత్రం రోజున దుర్గమ్మకు, అమ్మవారికి చండీహోమం శరన్నవరాత్రుల రోజుల్లో దుర్గాదేవికి అలంకరణలు, లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. అమ్మవారి పాత విగ్రహానికి ఆలయం వెనుక ప్రత్యేక గది కట్టి నిత్యపూజలందిస్తున్నారు. చండీహోమాన్ని అమ్మవారి విగ్రహానికి ఎదురుగా నిర్వహిస్తున్నారు. సహస్ర దీపాలంకరణ అమ్మవారికి జరుగుతుంది. రైల్వేస్టేషన్ ప్రాంతం కావడంతో నిత్యం వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి తరిస్తారు.

బలిహరణ ప్రదేశం వద్దనే భోగం

వనంగుడిలో బలిహరణ ప్రదేశం వద్ద భోగం పెట్టడం ఇక్కడ ప్రత్యేకంగా కనిపిస్తుంది. నాడు పైడితల్లి అమ్మవారిని ప్రతిష్ఠించిన ప్రదేశం కావడమే దీనికి కారణం. పైడితల్లి అమ్మవారికి పసుపు, కుంకుమలు ఇచ్చే భక్తులు కూడా ఇక్కడే ముందుగా పసుపు, కుంకుమలు వేసి మొక్కులు చెల్లిస్తారు. అప్పట్లో ఆలయం పెద్ద చెరువుకు ఎదురుగా ఉండేది. కానీ జనసంచారం దృష్ట్యా ఆలయాన్ని దాదాపు 18ఏళ్ల కిందట రైల్వేస్టేషన్ వైపు ముఖ ద్వారంగా ఉంచి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. అయితే తొలుత పూజలందుకున్న విగ్రహాలు అవసాన దశకు చేరుకోవడంతో చిన్న తల్లి విగ్రహాలను భీమునిపట్నం సముద్రంలో వేదమంత్రోచ్చారణలతో కలిపేశారని పెద్దలు చెబుతుంటారు.

అన్నను వారించినా..

బొబ్బిలి యుద్ధం సమయంలో రాబోయే ఉపద్రవాన్ని గుర్తించి తన అన్న విజయరామరాజును పైడితల్లమ్మ ముందే హెచ్చరించింది. యుద్ధం వద్దని వారించినా ఆమె మాటను అన్న పెడచెవిన పెట్టాడు. యుద్ధంలో విజయరామరాజును తాండ్ర పాపారాయుడు హతమారుస్తాడు. పెద్దవిజయ రామరాజును రక్షించుకోవాలని చిన్నారి పైడితల్లి..పతివాడ అప్పలనాయుడు సహాయంతో యుద్ధం జరిగే స్థలానికి బయలుదేరింది. వారిద్దరూ కోట దగ్గర నుంచి బయలుదేరి పెద్దచెరువు వద్దకు వచ్చేసరికి అన్న మరణవార్త ఆమె చెవిన పడుతుంది. అన్నంటే ఎంతో అభిమానం. వాత్సల్యం ఉన్న ఆమె ఆ వార్త విని తట్టుకోలేక తాను నిత్యం పూజించే మహాశక్తిని ప్రార్థిస్తూ పెద్ద చెరువులో లీనమైపోయింది.

పెద్దచెరువులో ప్రతిరూపాలు

అదేరోజు రాత్రి పతివాడ అప్పలనాయుడు కలలో పైడితల్లి కనిపించి..తన ప్రతిరూపాలు పెద్దచెరువులో లభ్యమవుతాయని, వాటిని తీసి ప్రతిష్ఠించి పూజలు చేయాలని కోరింది. ఆ ప్రకారంగానే రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పెద్దచెరువులో బెస్తవారి సహాయంతో వెతగ్గా ఆ నీటిలో అమ్మ ఓ మెరుపులా సాక్షాత్కరించి తానిక్కడ ఉన్నాననే సంకేతాన్నిచ్చింది. వెంటనే వారు ఆ ప్రదేశంలో వెతగ్గా అమ్మ విగ్రహాలు లభ్యమయ్యాయి. అమ్మవారిని ప్రతిష్ఠించి గుడి నిర్మించారు. అప్పట్లో ఆ ప్రాంతమంతా దట్టమైన అరణ్యం కావడంతో వనంగుడి అని పేరువచ్చింది. సిరిమానోత్సవాన్ని కూడా చదురు కట్టి నిర్వహించడం కోటశక్తికి పూజలు చేయడం మూలంగా చదురుగుడి వద్ద సిరిమానోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా మారింది.



బలిహరణ ప్రదేశం వద్ద పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అమ్మ సేవలోనే..



ఊహ తెలిసినప్పటి నుంచి అమ్మవారి సేవలోనే తరిస్తున్నాను. నాన్న నేతేటి శ్రీనివాసరావు అకాల మరణం తర్వాత ఉద్యోగ రూపంలో మళ్లీ అమ్మవారు నాకు అవకాశం ఇచ్చారు. ఎందరో భక్తులు అమ్మ మహిమలతో పాటు వారికి కలిగిన మంచి పనుల గురించి నాతో అనుభవాన్ని పంచుకుంటుంటే ఎంతో ఆనందం కలుగుతుంది. అమ్మవారికి సేవ చేసే అదృష్టం నాకు కలగడం పూర్వజన్మసుకృతం. ప్రకృతి స్వరూపిణి పైడితల్లి అమ్మవారిని సేవించి, తరించండి. ఆ తల్లి ఆశీస్సులు పొందండి.

– నేతేటి ప్రశాంత్, అర్చకుడు, వనంగుడి, విజయనగరం

‘బుచ్చి అప్పారావు’ పేరు పునరుద్ధరించాలి

- జెడ్పీచైర్మన్‌కు కొప్పల వెలమ సంఘం వినతి



జెడ్పీ చైర్మన్ శ్రీనివాస రావుకు వినతి పత్రం అందజేస్తున్న కొప్పల వెలమ సంఘం నాయకులు

విజయనగరం ఫోర్ట్: స్వాతంత్య్ర సమరయోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు పేరు తాటిపూడి జలాశయానికి పునరుద్ధరించాలని కొప్పల వెలమ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం వారు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ గొర్రిపాటి బుచ్చి అప్పారావు బలహీనవర్గాల ఆశాజ్యోతి అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇటీవల తాటిపూడి జలాశయానికి ఉన్న బుచ్చి అప్పారావు పేరును తొలగిస్తూ జీఓ నంబర్ 35ను రద్దు చేసిందన్నారు. స్వాతంత్య్ర సమరయోధుడి పేరు తొలగించడం కూటమి ప్రభుత్వానికి సరికాదని మండిపడ్డారు. జెడ్పీ చైర్మన్‌కు వినతి పత్రం ఇచ్చిన వారిలో కొప్పల వెలమ సంక్షేమ సంఘం నాయకులు గుణుపూరు రామరావు, మేశాపు శ్రీహరినాయుడు, నెక్కల నాయుడుబాబు, కాపారపు శివున్నాయుడు, చొక్కాకుల రామకృష్ణ, దొగ్గ దేముడు, వర్రి నరసింహమూర్తి, లచ్చిరెడ్డి కృష్ణ, రొంగలి కనకసింహాచలం, గొర్లె రవికుమార్, శీర సత్యనారాయణ ఉన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దత్తిరాజేరు: మండలంలోని చౌదంతివలస గ్రామానికి చెందిన ఈదుబిల్లి భాస్కరరావు(48)పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొద్ది రోజులుగా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతున్న భాస్కరరావు మనస్తాపం చెంది శనివారం ఉదయం గ్రామంలో పురుగు మందు తాగేశాడు. ఈ విషయం గమనించిన కుటుంబసభ్యులు బాడంగి పీహెచ్‌సీకి అక్కడి నుంచి విజయనగరం సర్వజన ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వైజాగ్ కేజీహెచ్‌కు తరలించడంతో కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య చిన్నమ్మి ఇద్దరు పెళ్లైన ఆడపిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



శంకర్ మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక కన్యకపరమేశ్వరి ఆలయం ఎదురుగా ఉన్న ఐడీబీఐ బ్యాంక్ ఏటీఎం వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్ టౌన్ ఎస్సై నరేష్ ఆదివారం తెలిపారు. సమీప ప్రాంతంలో విచారణ చేయగా సమాచారం ఏమీ తెలియలేదన్నారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించామని ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని కోరారు.

చెరువులో పడి యువకుడు..

వంగర: మండల పరిధి అరసాడ గ్రామానికి చెందిన సుకాసి శంకర్ (34) చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ నెల 5వ తేదీ సాయంత్రం బహిర్భూమికి వెళ్లిన శంకర్ కాలుజారి చెరువులో పడి మృతిచెందినట్లు మృతుడి తల్లి గౌరమ్మ ఆదివారం ఫిర్యాదు చేయగా మృతదేహాన్ని రాజాం సీహెచ్‌సీ తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

19 టన్నుల పీడీఎస్ బియ్యం సీజ్



పీడీఎస్ బియ్యం పరిశీలిస్తున్న ఎస్సై లక్ష్మణరావు, సివిల్ సప్లయిస్ డీటీ ఇతర అధికారులు

బొండపల్లి: మండలంలోని నెలివాడ రెవెన్యూ పరిధిలో గల ఒక గొడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని బొండపల్లి పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆదివారం సాయంత్రం సీజ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఒక గ్రామానికి చెందిన వ్యాపారస్తులతో పాటు, బోడసింగి పేట గ్రామానికి చెందిన వ్యక్తులు డీలర్ల నుంచి పీడీఎస్ బియ్యం సేకరించి నెలివాడ రెవెన్యూ పరిధిలోని ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆ గొడౌన్‌ను పరిశీలించి అక్రమంగా నిల్వ చేసిన బియ్యం బస్తాలను గుర్తించారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ చేసిన 385 బియ్యం బస్తాలు (19 టన్నులు) గుర్తించి వాటిని గజపతినగరం సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ కె.తిరుపతిరావుకు అప్పగించారు. పోలీసులు అప్పగించిన బియ్యంపై పూర్తిస్థాయిలో వివరాలు సేకరించి వాటిని ఏసీ అధికారులకు సోమవారం అప్పగించనున్నట్లు డీటీ తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన వారిపై 6ఎ కేసు నమోదు చేయనున్నట్లు డీటీ చెప్పారు. ఈ దాడుల్లో కొండకిండాం వీఆర్‌ఓ దుర్గాతో పాటు పోలీసులు ఇదర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠినచర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మద్యం తాగిన వారిపై 20 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదుచేశారని పేర్కొన్నారు. అలాగే వాహన తనిఖీల్లో ఎంవీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 383 ఈ చలానాలు విధించామన్నారు. ఇప్పటివరకూ మద్యం తాగి వాహనాలను నడిపిన వారిపై 4336 డీడీ కేసులు నమోదుచేయగా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి, ప్రజాశాంతికి భంగం కలిగించిన వారిపై 9094 కేసులు నమోదుచేశామని ఎస్పీ ప్రకటనలో వివరించారు.

పాలిష్‌తో ఆరోగ్యం లాస్

- తెల్లబియ్యంలో విటమిన్స్ నిల్
- ప్రకృతి సాగులో మినరల్ రైస్ ఉత్పత్తి
- పెరిగిన పురాతన వరి వంగడాల ఆవశ్యకత
- మార్కెట్‌లో రంగుల బియ్యం సిద్ధం



మార్కెట్‌లోకి వచ్చిన రంగు రంగుల బియ్యం రకాలు



ఒక్క పట్టుతో దంపుడు బియ్యం

భామిని: మనిషి ఆహారంలో ప్రధానమైన అన్నం వండడానికి అవసరమైన బియ్యం తెల్లదనం కోసం పాట్లు పడుతూ అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు. పురాతన దంపుడు బియ్యం మరిచి, వాటి రూపు పూర్తిగా మార్చి మల్లె పువ్వు లాంటి తెలదనం కోసం ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. సమాజంలో గుర్తింపు కోసం శరీరాన్ని గుల్ల చేసుకుంటున్నారు. నిత్యం కష్టించి పనిచేసే రైతు కుటుంబాలు సైతం తెల్లని సన్నబియ్యానికి అలవాటు పడి అనారోగ్యం కొని తెచ్చు కుంటున్నారని, ఎముకల బలహీనత, దృష్టి లోపం బారిన పడుతున్నారని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు.

పాలిష్‌బియ్యంతో నష్టాలు..

మిల్లింగ్ చేసిన ఎర్ర బియ్యం మీద మొదటి పొర పాలిష్ పేరున పొట్టు తీయంతోనే అతి ముఖ్యమైన పోషక పదార్థాలు 50 శాతం పోతున్నాయి. ముఖ్యమైన బి విటమిన్ల సముదాయం, విటమిన్-ఈ పీచు పదార్థాలు, లిపిథిన్ కోల్పోతాం.

రెండవ పాలిష్‌తో..

రెండవ పాలిష్‌తో బియ్యం తెల్లగా మెరుస్తుంటాయి. కానీ రెండవ సారి పాలిష్‌తో వచ్చే తాడు పేరున 30 శాతం పోషక పదార్థాలు పోతాయి. రెండవ పాలిష్ తాడుతో థైమైన్(బి), రిబోఫ్లేవిన్ (బి)నైసిన్, పైరిడాక్సిన్(బి),పేంథోనిక్ ఏసిట్, జింక్, ఐరన్ వంటి పోషకాలు కోల్పోతున్నాం.

మన్యం జిల్లాలో కలర్ రైస్ ఉత్పత్తులు..

తెల్ల బియ్యం వాడకంతో వచ్చే నష్టాల భర్తీకి పురాతన దేశీవాళీ బియ్యం రకాలు అందుబాటులోకి వస్తున్నాయి. ప్రకృతి సాగులో పరిచయం చేస్తున్నారు. రంగు రంగుల ముతక బియ్యం పండించి అందుబాటులోకి తెచ్చి ఆరోగ్యం కాపాడుకునే పరిస్థితులు కల్పిస్తున్నారు.

వాటిలో కొన్ని రకాలు

మైసూరు మల్లిక-ఇది సన్నరకం దేశీవాళీ బియ్యంలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ.సెలీనియం పదార్థం కలిగి ఉండడంతో రోగ నిరోధక శక్తి పెంపొందిస్తుంది.
- కాలా బట్టీ-ఇది నలుపు రకం దేశీ వరి.ఇందులో బి-6,బి-12 విటమిన్లు అధికం. శరీరంలోని క్యాన్సర్ కణాలను నిర్మూలిస్తుంది. పీజు పదార్థం, మినరల్స్ అధికం.
- రత్న చోడి-ఇది ప్రాచీన కాలం నాటి వరి రకం.సైనికులకు కండ పుష్టి కోసం ఆహారంగా వాడే వారు. రోగనిరోధక శక్తి పెంపొందిస్తుంది. అధిక శాతం విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ కలిగి ఉన్న బియ్యం ఇవి.
- కుజి పటాలియా-కేలరీలు,గ్లూకోజ్ తక్కువగా ఉంటుంది.రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.
- నవారా-ఇది ఎరుపు రకం బియ్యం. మధుమేహం నియంత్రణ లో కీలకం. వీటిని ఆయుర్వేదంలో ఔషధం కింద వా డే వారు. మోకా ళ్లు, మోచేయి, కీళ్ల నొప్పులు, నరాల బలహీనత తగ్గడానికి ఉపకరిస్తా యి. ఇవి ఒక పూ ట మాత్రమే తినా లి. వీటి బియ్యం నుంచి కూడా మొ లకలు వస్తాయి.
- తైవాన్ బ్లాక్-ఇవి నలుపు రకం బియ్యం.ఇందులో ఆంకోసైనిన్..యాంటీ ఆక్సిడెంట్లు పని చేసి రోగ నిరోధక ఎంజైములను క్రియాశీలకం చేస్తాయి. క్యాన్సర్, డయాబెటిస్, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది.

తెల్ల బియ్యంతో రుగ్మతలు

విటమిన్లు లేని తెల్లని అన్నం తినడంతో ఎక్కువగా అలసిపోవడం, త్వరగా నీరసం రావడం, పిక్కలు లాగడం, కష్టపడి పనిచేయలేక పోవడం వంటి రుగ్మతలు వస్తాయి.
- బియ్యం పైపొరలో విటమిన్ ఈ ఉంటుంది. ఇది త్వరగా ముసలి తనం రాకుండా చేస్తుంది. తెల్లటి బియ్యంలో ఇది పూర్తిగా కనిపించదు. లిసిథిన్ అనే పదార్థం తెల్లటి బియ్యంలో ఉండదు. ఈ పదార్థం శరీరంలో కొవ్వు పేరుకుపోకుండా నివారించి నిరోధిస్తుంది.గుండె జబ్బులు రాకుండా నివారించే శక్తి తెల్లటి బియ్యంలో ఉండదు. పీచు పదార్థాల న్నీ బియ్యంపై పొరలో ఉండడం వల్ల, తెల్ల బియ్యంలో పీచు పదార్థాలు లేకపోవడంతో మలబద్ధకం వస్తుంది. ఎన్ని మందులు వాడినా తగ్గదు.
- తెల్లటి బియ్యంలో పీచు పదార్థాలు లేనందున తిన్న అహారం ద్వారా వచ్చిన శక్తి రక్తంలోకి ఒకే సారి చేరిపోతుంది.ఈ శక్తి కొవ్వుగా మార్చి వేస్తుంది. ఫలితంగా మధుమేహ వ్యాధి బారిన పడే ఆస్కారం ఉంటుంది. అదే పీచు పదార్థాలుంటే ఈ ప్రక్రియను ఆలస్యం చేస్తాయి.

శ్రేష్టమైన పురాతన వరి సాగు



పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రకృతి సాగు పద్ధతిలో ఆరోగ్యాన్ని పెంచే వరి రకాలు పండించడం పై దృష్టి సారించాం.ప్రకృతి సాగు పద్ధతిలో ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది ద్వారా పురాతన దేశీవాళీ రకాల వరి సాగు చేయించి రైతులకు అవగాహన పెంచుతున్నాం.ప్రకృతి సాగు సిబ్బంది వద్ద వివిధ రకాల బియ్యం సిద్ధంగా ఉంచాం. ఆరోగ్యపరంగా ఈ పురాతన దేశీయ రకాల వాడకంతో అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. రంగు రంగుల బియ్యం అందుబాటులో ఉన్నాయి. పురాతన రకాల దేశీవాళీ వరి విత్తనాల రకాలు సిద్ధంగా ఉన్నాయి.ఆసక్తి గల రైతులు సొంతానికి పండించి ఉపయోగించవచ్చు.

పి.షణ్ముఖరాజు, డీపీఎంఎస్‌పీఎం, పార్వతీపురం మన్యం జిల్లా

వంట గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

- ఒకరి మృతి,ఇద్దరి పరిస్థితి విషమం
- ఫ్యూజన్ బ్రిక్స్ పరిశ్రమ కూలీల నివాసంలో ప్రమాదం
- మృతుల్లో ఒకరు జిల్లా వాసి



ప్రమాద తీవ్రతకు రేకులు ఎగిరిపోయిన షెడ్డు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఉపేంద్ర, సిబ్బంది



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లోకనాథ్

యలమంచిలి రూరల్ : మండలంలోని ఫ్యూజన్ పరిశ్రమ ఆవరణలో కూలీలు నివాసముంటున్న షెడ్‌లో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ కూలీ మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో మృత్యువుతో పోరాడుతున్నారు. యలమంచిలి మండలం లైన్ కొత్తూరు పంచాయతీ శివారులో ఫ్యూజన్ బిల్డింగ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ఉంది. ఇక్కడ సిమెంట్ ఇటుకలు తయారు చేస్తారు. ఒడిశా సహా, మన రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వచ్చిన కూలీలు పనిచేస్తున్నారు. పరిశ్రమ ఆవరణలోనే కార్మికుల కోసం 12 రేకుల షెడ్లు నిర్మించారు. ఒక్కో షెడ్‌లో ముగ్గురేసి చొప్పున కార్మికులు ఉంటున్నారు. శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో డ్యూటీ దిగిన బడకల కేశవరావు, లోకనాథ్, కృష్ణారెడ్డి అనే ముగ్గురు కూలీలు వంట చేసుకునేందుకు షెడ్‌లోకి వెళ్లారు. అప్పటికే వంట గ్యాస్ సిలిండర్ లీకై గ్యాస్ వ్యాపించి ఉంది. గమనించకుండా లైట్ ఆన్ చేయడంతో ఆ స్పార్క్‌కు ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో ముగ్గురు కార్మికులు మంటల్లో కాలిపోతూ బయటకు పరుగులు తీశారు. వీరిని పరిశ్రమకు చెందిన కారులో యలమంచిలిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారికి చికిత్స చేసే పరిస్థితి లేదని సిబ్బంది చెప్పడంతో షీలానగర్ కిమ్స్ ఐకాన్‌కు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. 85 శాతానికి పైగా శరీరం కాలిపోవడంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం పత్రిపుట్టుగకు చెందిన బడకల కేశవరావు(52)మృతి చెందాడు. మృతునికి భార్య రాజులమ్మ, కుమారులు శశి, శ్రీకాంత్, కుమార్తె ఉన్నారు. కుటుంబ పోషణ కోసం కేశవరావు పరిశ్రమలో పని చేస్తూ ఊహించని రీతిలో ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎం.లోకనాథ్, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహానీ గ్రామానికి చెందినవాడు.జి. కృష్ణారెడ్డి కూడా సుహానీ గ్రామం శాంతినగర్ నివాసి. వీరి పరిస్థితి విషమంగా ఉంది. యలమంచిలి సీఐ ధనుంజయరావు, రూరల్ ఎస్ఐ ఉపేంద్ర, అగ్నిమాపకాధికారి రాంబాబులు ఆదివారం ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. శనివారం రాత్రే కేజీహెచ్‌కు వెళ్లిన పోలీసులు.. క్షతగాత్రుల నుంచి వాంగ్మూలం సేకరించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

ఆ షెడ్‌లకు అనుమతులూ లేవు..

ఏడాది కిందట వీరంతా ఓ కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా ఫ్యూజన్ పరిశ్రమలో ఉత్పత్తి విభాగంలో రోజువారీ కూలీలుగా చేరారు. మెరుగైన వసతి కల్పిస్తామని నమ్మబలికి పరిశ్రమలో పనికి తెచ్చిన యాజమాన్యం, కాంట్రాక్టర్.. పరిశ్రమ ఆవరణలో ఓ మూలన నిర్మించిన రేకుల షెడ్లను గదులుగా చేసి వసతి కల్పించారు. షెడ్లులో వెంటిలేషన్ కూడా లేకపోవడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని చెబుతున్నారు. అయితే ఈ షెడ్లకు గ్రామ పంచాయతీ అనుమతులూ లేవని తెలిసింది. మృతుడు కేశవరావు కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని సీఐటీయూ యలమంచిలి నేత చింతకాయల శివాజీ డిమాండ్ చేశారు.